# మహిళల అభ్యున్నతే ప్రభుత్వం లక్ష్యం



సుల్తానాబాద్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్, అక్టోబర్ 4 : రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్నదని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్‌లోని ఎస్ఆర్ గార్డెన్‌లో మండల మహిళా సంఘాలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం ఒక్కో గ్రూపునకు రూ. 15 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు రుణాలు అందిస్తున్నారని తెలిపారు. పావలా వడ్డీ రుణాలతో పాటు మహిళా సంఘ భవనాలు, మహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నదని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ఇంటింటా ప్రచారం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు.

**క్రీడారంగానికి పెద్దపీట**

రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న క్రీడాసామగ్రిని ఆయా గ్రామాలతో పాటు మున్సిపాలిటీకి అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీతారమేశ్, లావణ్య, మానస, ఎంపీడీవో శశికళ, కమిషనర్ మల్లికార్జున్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

**వాల్ పోస్టర్ల విడుదల**

సుల్తానాబాద్ రూరల్,అక్టోబర్4: నారాయణ పూర్ మాజీ సర్పంచ్ గుడుగుల అపర్ణ-సతీశ్ ఆధ్వర్యంలో కారుగుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్ రెడ్డిని గెలిపించాలని వాల్ పోస్టర్లను ముద్రించారు. చిన్నకల్వల ఆలయంలో ఈ వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే మనో హర్ రెడ్డి బుధవారం విడుదల చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాసర్ల అనంతరెడ్డి, ఎంపీపీ పొన్నమనేని బాలాజీ రావు, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పురం ప్రేమ్‌చందర్‌రావు, ఎంఎంసీ చైర్మన్ బుర్ర మౌనిక-శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ ఎరుకొండ రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ సంపత్‌గౌగ్, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

# సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం

- జడ్పీ చైర్మన్, మంథని అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్



రామగిరి : పుట్ట మధూకర్‌కు స్వాగతం పలుకుతున్న సర్పంచ్ గంట పద్మ వెంకటరమణారెడ్డి

రామగిరి, అక్టోబర్ 4 : హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తున్న బిడ్డలకు డబ్బులు ఎర వేసి కాంగ్రెస్ పార్టీకి చెందిన మంథని ఎమ్మెల్యే సోషల్ మీడియా వేదికగా తనపై దుష్ప్రచారం చేయిస్తున్నాడని మంథని అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ ఆరోపించారు. పుట్ట మధూకర్ చేపట్టిన పాదయాత్ర రామగిరి మండలంలో రెండో రోజు కల్వచర్ల గ్రామం వద్ద ప్రారంభమైంది. సర్పంచ్ గంట పద్మ వెంకటరమణారెడ్డి మొక్కను అందించి పాదయాత్రకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంథని నియోజక వర్గంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారే ఏళ్ల తరబడి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారని ఆ పార్టీలో ఇతరులకు అవకాశం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. తను ఒకసారి ఓటమి చవి చూసినా సీఎం కేసీఆర్ తనకు మూడు సార్లు అవకాశం కల్పించినట్లు తెలిపారు. అనంతరం పన్నూర్, కల్వచర్ల గ్రామాలకు చెందిన మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ పాదయాత్రలో టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, జడ్పీటీసీ మ్యాడర వేన శరద కుమార్, కమాన్‌పూర్ ఏఎంసీ చైర్మన్ దాసరి రాయలింగు,పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, సర్పంచ్ ఎండీ మంజూర్ అహ్మద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శంకేసి రవీందర్, నాయకులు రేండ్ల అశోక్, కొలిపాక సత్తయ్య, దేవ శ్రీనివాస్, జాఫర్, బంకు మల్లేశ్, కుడిది వేణు, బూస కనుకయ్య, పుల్లెల కిరణ్, గౌతం శంకరయ్య, కన్నూరి శ్రీశైలం పాల్గొన్నారు.

**నివాళి**

మంథని, అక్టోబర్ 4: మంథని మున్సిపల్ పరిధిలోని బోయినిపేటకు చెందిన ఆకుల భవానీ శంకర్(23) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందగా ఆయన మృతదేహానికి పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

**నేటితో ముగియనున్న పాదయాత్ర**

మంథని/ మంథని రూరల్/కమాన్‌పూర్, అక్టోబర్ 4: గత నెల 25న చేపట్టిన పుట్ట మధూకర్ ప్రజా ఆశీర్వాద యాత్ర గురువారం ముగియనుంది. చివరి రోజు పుట్ట కమాన్‌పూర్ మండలంలోని ఆదివరాహస్వామి దేవాలయం నుంచి పాదయాత్ర ప్రారంభమై మంథని పట్టణానికి చేరుకుంటారు. మల్లేపల్లి శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలుకనున్నారు. మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని క్రీడా మైదానంలో ముగింపు సభలో ప్రసంగించి పాదయాత్రను ముగించనున్నారు. 11రోజుల పాటు నిర్వహించి న పాదయాత్రలో 311కిలో మీటర్లు పూర్తి చేయనున్నారు.ముగింపు సభకు మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేష్‌నేత, భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి హాజరు కానున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో రానున్నారు.

## సకాలంలో సీఎంఆర్ సరఫరా చేయాలి

పెద్దపల్లి, అక్టోబర్ 4: సకాలంలో సీఎంఆర్ సరఫరా చేయాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లకు సూచించారు. స్థానిక సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో సీఎంఆర్ డెలివరీపై బుధవారం సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ 2022-23న సంబంధించి సీఎంఆర్ గడువులోగా పూర్తి చేయాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. నిర్దేశిత సమయంలో లక్ష్యాలు చేరుకోని రైస్ మిల్లులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రైస్ డెలివరీ చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా మేనేజర్ సివిల్ సప్లయ్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, మిల్లర్లు పాల్గొన్నారు.

## కేసీఆర్ సేవాదళం చేయూత

పెద్దపల్లి రూరల్, అక్టోబర్ 4: మండలంలోని బొంపల్లిలో వేముల సత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని కేసీఆర్ సేవాదళం నాయకులు బుధవారం పరామర్శించి ఓదార్చారు. కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జూలపల్లి జడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ స్థానిక నాయకుల ద్వారా పంపించిన రూ.5 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశం, ప్రధాన కార్యదర్శి శాతాళ్ల కాంతయ్య, స్థానిక నాయకులు ఉన్నారు.

## నేడు గోదాం ప్రారంభం

కాల్వశ్రీరాంపూర్, అక్టోబర్ 4: కాల్వశ్రీరాంపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో నాబార్డు నిధులు రూ.38.50 లక్షలతో నిర్మించిన గోదాం ను పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభిస్తారని విండో చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, సీఈవో కోలేటి శ్రీనివాస్ తెలిపారు. పాలకవర్గ సభ్యులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నాగులపల్లిలో పశు వైద్య శిబిరం

జూలపల్లి, అక్టోబర్ 4 : నాగులపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. 32 పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు, 5 కృత్రిమ గర్భధారణ, 28 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. ఇక్కడ సర్పంచ్ పొలవేని వీరయ్య, మండల పశు వైద్యాధికారి అజారొద్దీన్, గోపాల మిత్రులు మోహన్‌రెడ్డి, మంద మల్లేశం, జక్కని యుగేందర్ పాల్గొన్నారు.



కొంకటి లక్ష్మీనారాయణ దంపతులను సన్మానిస్తున్న కోరుకంటి చందర్

# అభివృద్ధికి చిరునామాగా రామగుండం

- కేటీఆర్ దత్తత ప్రకటన సంతోషకరం - ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, అక్టోబర్ 4: మంత్రి కేటీఆర్ దత్తత ప్రకటనతో రామగుండం నియోజకవర్గం అభివృద్ధికి చిరునామాగా మారనుందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆశాభావం వ్యక్తం చేశారు. కేటీఆర్ రామగుండం దత్తత ప్రకటన సంతోషకరమని తెలిపారు. మంగళవారం రామగుండం కార్పొరేషన్ 31వ డివిజన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమైక్య పాలనలో ఆకలి చావులు, ఆత్మహత్యలు ఉండేవని, తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో సంక్షేమ పాలన సాగుతోందన్నారు. ప్రతీ ఇంటికి సంక్షేమంతో అందరి ముఖంలో ఆనందం కనబడుతుందన్నారు. 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్, టీడీపీ చేసిన నిర్వాకం వల్లనే తెలంగాణ ప్రజల బతుకులు నాశనమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి వారసులకు తిరిగి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించి, 22 వేలమంది జీవితాల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపారని గుర్తు చేశారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. గోదావరిఖనిలో ఐటీ పార్కు, అంతర్గాంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి దొరికిందన్నారు. మంత్రి కేటీఆర్ రామగుండం దత్తత ప్రకటనతో నియోజకవర్గం సిద్దిపేట, సిరిసిల్ల తరహాలో మారబోతుందన్నారు. జిల్లాలోనే రామగుండంను భారీ మెజార్టీతో గెలిపిస్తే, దత్తత తీసుకుంటానని దశాబ్ది ప్రగతి సభలో మంత్రి కేటీఆర్ ప్రకటించారన్నారు. ప్రజలు పార్టీకి భారీ మెజార్టీ అందించాలని కోరారు. సమావేశంలో మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు తదితరులున్నారు.

**కొంకటిని సన్మానించిన ఎమ్మెల్యే**

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులుగా ఎన్నికైన కొంకటి లక్ష్మీనారాయణను రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

**రామగుండంకు డిజిటల్ లైబ్రరీ మంజూరు**

రామగుండం నియోజక వర్గానికి డిజిటల్ లైబ్రరీ మంజూరైనట్లు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. సింగరేణి సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.2.5లక్షలతో ఈ డిజిటల్ లైబ్రరీ నిర్మాణం కానుందన్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

# ఓటరు తుది జాబితా విడుదల

పెద్దపల్లి , అక్టోబర్4 : జిల్లాలో తుది ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ బుధవారం విడుదల చేశారు. మంథని, రామగుండం, పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో తుది ఓటరు జాబితా విడుదల చేశామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,45,829 మంది పురుషులు, 3, 48,729 మంది మహిళలు, 54 మంది ఇతర జెండర్ ఉన్నారు. మొత్తం 6, 94, 612 మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 1,23,768 మంది పురుషులు, 1,25, 555 మంది మహిళలు, 9 మంది థర్డ్ జెండర్ ఉన్నారు. మొత్తం 2,49, 332 మంది ఓటర్లు ఉన్నారు. రామగుండం నియోజకవర్గం పరిధిలో 1,08, 233 మంది పురుషులు, 1,06,716 మంది మహిళలు, 25 మంది ఇతర జెండర్, మొత్తం 2, 14, 974 మంది ఓటర్లు ఉన్నారు. మంథని నియోజకవర్గం పరిధిలో 1,13, 828 మంది పురుషులు, 1, 16 , 458 మంది మహిళలు, 20 మంది ఇతర జెండర్, మొత్తం 2,30 , 306 మంది తుది జాబితాలో ఉన్నారని వెల్లడించారు.

## మహాత్మా జ్యోతిబా పూలే అవార్డుకు ఆడెపు శంకర్

కోల్‌సిటీ, అక్టోబర్ 4: పద్మశాలీ సేవా సంఘం రామగుండం కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి ఆడెపు శంకర్ మహాత్మా జ్యోతిబా పూలే అవార్డుకు ఎంపికయ్యారు.20 ఏళ్లుగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. బహుజన సాహిత్య అకాడమీ ఈ సంవత్సరం పూలే అవార్డుకు గోదావరిఖని నుంచి శంకర్‌ను ఎంపిక చేసింది. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లో బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ అవార్డు ఎంపిక పత్రాన్ని అందజేశారు. ఈనెల 15న ఢిల్లీలో జరిగే బహుజన రైటర్స్ నేషనల్ కాన్ఫరెన్స్‌లో అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కాగా, తనను ఈ అవార్డుకు ఎంపిక చేయడం పట్ల నల్ల రాధాకృష్ణ, సభ్యులు పీ రాజలింగంకు శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ప్రతిష్ఠాత్మక పూలే అవార్డుకు ఎంపిక చేయడం పట్ల పద్మశాలీ సంఘం నాయకులు హర్షం ప్రకటించారు.

## నిత్యాన్నదానం ప్రారంభం

కోల్‌సిటీ, అక్టోబర్ 4: సమాజంలో పేదరికం శాపమై ఆకలితో ఎవరూ బాధపడొద్దనే ధ్యేయం, ప్రయాసాలకోర్చి నిత్యాన్నదానం చేయాలని నిశ్చయించుకున్నామని లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు లయన్ తానిపర్తి విజయలక్ష్మి అన్నారు. ఈ మేరకు మీల్స్ ఆన్ వీల్స్ ద్వారా గోదావరిఖనిలో బుధవారం నుంచి నిత్యాన్నదానం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఒకరోజు దాదాపు 100 మందికి అన్నదానం చేశారు. ఆమె మాట్లాడుతూ మొదట క్లబ్‌లోని సభ్యుల్లో ఎవరైనా పుట్టిన రోజు, ఇతర ముఖ్యమైన సందర్భాలలో మీల్స్ ఆన్ వీల్స్ ద్వారా పేదలకు అన్నదానం చేయడం ప్రారంభించామని, చాలా మంది నుంచి వస్తున్న విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకొని క్లబ్ సభ్యులతో చర్చించి ఇక ఏడాది పొడవునా అన్నదానం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇదే ఐక్యత, సేవా స్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో సెక్రెటరీ బంక కళావతి, తిలక్ చక్రవర్తి, రామస్వామి తదితరులున్నారు.